కెటిఆర్ మరో స్కామ్‌లో దొరికిపోతారు

- బండి సంజయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ పునరుద్ఘాటించారు. వేములవాడలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కెసిఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో దొరికిపోయారన్నారు. కెటిఆర్‌ను ఉద్దేశించి మరో స్కామ్‌లో దొరికిపోతున్నారని ఆరోపించారు. కెటిఆర్ డ్రగ్ టెస్టుకు ఇప్పుడు వెంట్రుకలు తీసుకోమంటున్నారని.. విదేశాల్లో ట్రీట్‌మెంట్ తీసుకొని వచ్చి ఇప్పుడు టెస్టుకు సిద్ధమంటున్నారని మండిపడ్డారు. డ్రగ్స్ కేసుల్లో మంత్రి కెటిఆర్ దోస్తులే ఉన్నారని ఆరోపించారు. హైదరాబాద్, బెంగళూరులో డ్రగ్స్ కేసులను దర్యాప్తు చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు వెంటనే వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు సంబంధించి టోకెన్ నెంబర్ వచ్చిన జిల్లాలకు వెంటనే వేతనాలను చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (టిఎస్‌జిసిసిఎల్‌ఎ-475) ఆర్థికశాఖకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణారెడ్డి, కొప్పిశెట్టి సురేష్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు సెప్టెంబర్, అక్టోబర్ వేతనాలకు సంబంధించి కమిషనర్ ప్రొసీడింగ్ వచ్చిన వెంటనే ఆయా డ్రాయింగ్ ఆఫీసర్లు బిల్లులు చేసి జిల్లా కోశాధికారులకు సమర్పించారని తెలిపారు. దీనికి సంబంధించి టోకెన్ నెంబర్లు వచ్చి ఈ కుబేరులోకి వాటిని పంపారని వివరించారు.

పుస్తక సంపద..

భావితరాలకు వారసత్వంగా అందిద్దాం...

- అందుకోసం వాటిని డిజిటలైజ్ చేయండి...
- హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- విద్యార్థులందరూ బుక్ ఫెయిర్‌ను సందర్శించాలి
- ఎక్కువ రోజులు పుస్తక ప్రదర్శనను కొనసాగిస్తామంటూ హామీ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పుస్తక సంపదను భావి తరాలకు వారసత్వంగా అందిద్దామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. కాగిత యుగం కనుమరుగు కాబోతోందన్న సంకేతాల నేపథ్యంలో వాటిని ఎంత మేర వీలైతే అంత డిజిటలీకరణ చేయాలని ఆయన కోరారు. ఆ రూపంలో రేపటి పౌరులకు వాటిని చేరువ చేయాలని అభిలషించారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో గురువారం 35వ జాతీయ పుస్తక మహోత్సవాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులందరికీ పుస్తక ప్రదర్శన సందర్శనకు అవకాశం కల్పించాలని కోరారు. అందుకనుగుణంగా విద్యాశాఖ అధికారులు, ఉన్నత విద్యామండలి అధికారులతో సమన్వయం చేసుకోవాలని భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికష్ణను ఆదేశించారు. రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో ఏయే పుస్తకాలున్నాయి.. అవిగాక ఏయే పుస్తకాలను అందుబాటులో ఉంచాలనే అంశంపై మేధావుల నుంచి సూచనలు, సలహాలను స్వీకరిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని విద్యాలయాల విద్యార్థులందరూ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సందర్శించాలని శ్రీనివాస్‌గౌడ్ ఈ సందర్భంగా సూచించారు.

ఉమ్మడి రాష్ట్రంలో బుక్ ఫెయిర్ నిర్వహణ కోసం స్థలాన్ని అద్దెకు తీసుకోవడం లాంటి ఎన్నో కష్టాలుండేవని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ వచ్చాక పుస్తక ప్రదర్శన కోసం ప్రభుత్వం ఉచితంగా స్థలం కేటాయిస్తోందని తెలిపారు. ఈ ప్రదర్శన జనవరి ఒకటితో ముగుస్తోందని, ఆ గడువును మరికొన్ని రోజులు పొడిగించాలంటూ ప్రజలు, మేధావుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని చెప్పారు. ఈ క్రమంలో ఎన్ని రోజులైనా సరే...బుక్ ఫెయిర్ నిర్వహణకు అనుమతినిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సిఎం కెసిఆర్ తెలంగాణ ఉద్యమం మొదలు పెట్టడానికి కూడా పుస్తకాలే కారణమని తెలిపారు. వాటిని చదవటం ద్వారా గొప్ప సంపద కలిగిన తెలంగాణ ప్రాంతం ఎంతో దుస్థితికి చేరిందనే విషయాన్ని ఆయన గ్రహించారని వివరించారు.

తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. గాంధీజీని చరిత్ర నుంచి కనుమరుగు చేసేందుకు కుట్రలు పన్నుతోందని చెప్పారు. ఆయన్ను చంపిన గాడ్సేను మహనీయుడిగా చిత్రీకరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భాల్లో వాస్తవాలను తెలుసుకునేందుకు పుస్తక పఠనం దోహదపడుతుందని వివరించారు. కరోనా కాలంలో సామాజిక మాధ్యమాల్లో అనేక తప్పుడు సమాచారం ప్రజలను గందరగోళానికి గురి చేస్తే, వాస్తవ సమాచారంతో సమాజాన్ని బతికించినవి పత్రికలేనని కొనియాడారు. పుస్తకాలను చదవటం ద్వారా దేశంలో జరిగిన ఉద్యమాలతోపాటు తెలంగాణలో కొనసాగిన పోరాటాలకు సంబంధించిన చరిత్రను తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పుస్తకాలు చదివితే జ్ఞానమొస్తుందని, ఆ జ్ఞానంతో ప్రపంచం అర్థమవుతుందని తెలిపారు.

పుస్తకాలతోనే సమాజ పురోగతి..
ఆర్ సుధాభాస్కర్, నవతెలంగాణ సంపాదకులు

'పుస్తకం చదివితే అది ప్రశ్నించడం నేర్పుతుంది. ప్రశ్నించడం ద్వారా అన్ని నేర్చుకుంటాం. ప్రశ్న లేకుండా సమాజం లేదు. సమాజ పురోగతి లేదు. అందుకే పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలి. ఉదాహరణకు వర్షం ఎందుకు పడుతుందని ప్రశ్నించుకుంటేనే, తెలుసుకుంటేనే శాస్త్రీయ విజ్ఞాన ప్రచారం జరుగుతుంది. పుస్తక ప్రదర్శనకు పది రోజుల పాటు ఉచితంగా స్థలం కేటాయించడం సంతోషం. దీన్ని మరికొద్ది రోజులు పొడిగించాలి. విద్యార్థులు పంచతంత్రం మొదలు అన్ని పుస్తకాలను చదవాలి'

అదనపు పుస్తకాలు చదవాలి..
కె.శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి సంపాదకులు

'తరగతి పాఠ్య పుస్తకాలతో పాటు అదనపు పుస్తకాలు చదివే వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది. పుస్తకం చదవడం ద్వారా ఎన్నో ఉపయోగాలున్నాయి. అలాంటి వారు వయస్సు మీద పడిన బలంగా ఉంటారు. లక్షల పదాలు అదనంగా తెలిసి ఉంటాయి. చదువుకునేందుకు ప్రచురించిన పుస్తకమే బాగుంటుంది. చదివిన పుస్తకాలపై స్నేహితులతో చర్చించాలి. ఈ తరాన్ని గందరగోళ పరిచే అనేక అంశాలు వచ్చి చేరాయి. సింగపూర్‌లో ప్రతి ఒక్కరూ ఒక పుస్తకం చదవాలనే ఉద్యమం వచ్చింది. అలాంటి ఉద్యమాలు స్థానికంగా కూడా రావాల్సిన అసరముంది. పుస్తకమనేది సమాజం ప్రస్తుతం ఎదుర్కొంటున్న జ్ఞానరాహిత్య సమస్య నుంచి బయపడేస్తుంది...'

పదాలపై పట్టు సాధించాలి..
కె.శ్రీనివాస్ రెడ్డి, ప్రజాపక్షం సంపాదకులు

'పుస్తకాలను చదవడం ద్వారా లక్షలాది పదాలపై పట్టు సాధించవచ్చు. ప్రపంచ అవకాశాల రీత్యా ఇంగ్లీషు నేర్చుకోవడం తప్పనిసరిగా మారింది. అదే సమయంలో తెలుగు, ఉర్దూ, హిందీ వంటి భాషలను నిర్లక్ష్యం చేయొద్దు. విద్యార్థి దశ విజ్ఞానాన్ని నేర్చుకోవడానికి అనువైనది. పలు దేశాల్లో సాంకేతికత పెరిగిన నేపథ్యంలో ఆయా కొత్త పదాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలి. ప్రదర్శనను మరికొన్ని రోజులు పొడిగించాలి...'

పుస్తకంతో మంచి భవిష్యత్తు..
తీగుళ్ల కష్ణమూర్తి, నమస్తే తెలంగాణ సంపాదకులు

'పుస్తకం చదివితే వెంటనే డబ్బు రాకపోవచ్చు. కాని మంచి భవిష్యత్తు ఉంటుంది. బుక్ ఫెయిర్, ప్రదర్శన అనే పదాలు అవి అందిస్తున్న సేవలకు సరిపడినట్టుగా లేదు. పుస్తకాల వేడుక, పుస్తకాల పండుగ, పుస్తకాల జాతర వంటి పేర్లను పరిశీలించి పెట్టాలి...'

కెసిఆర్ జన్మదినం...పుస్తక పఠన దినోత్సవం : జూలూరు

పుస్తక ప్రియుడైన సిఎం కెసిఆర్ జన్మదినోత్సవాన్ని పుస్తక పఠన దినోత్సవంగా నిర్వహిస్తే బాగుంటుందని జూలూరి గౌరీశంకర్ సూచించారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన 'తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర' పుస్తకాన్ని బహుకరించి సన్మానించారు. అనంతరం తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ స్టాళ్లను అల్లం నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్త దినపత్రిక అసోసియేట్ ఎడిటర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ కోయ చంద్రమోహన్ స్వాగతం పలకగా, కార్యదర్శి శృతికాంత్ భారతి వందన సమర్పణ గావించారు. బుక్ పెయిర్ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అసెంబ్లీలోనూ ఇక నుంచి బిఆర్ఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ శాసనసభలో టిఆర్ఎస్ పేరును బిఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి)గా మార్చారు. శాసనసభ, మండలిలో టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మారుస్తూ గురువారం అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు బులెటిన్ జారీ చేశారు. టిఆర్ఎస్ఎల్‌పి ఇక నుంచి బిఆర్ఎస్ఎల్‌పిగా కార్యకలాపాలు నిర్వహించనుంది. టిఆర్ఎస్‌ను భారత్ రాష్ట్ర సమితిగా మారుస్తూ కేంద్ర ఎన్నికల సంఘం డిసెంబర్ 8న నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

ఏప్రిల్ ఐదున చలో ఢిల్లీ

- బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి
- కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల ఐక్యత పెరగాలి
- విడివిడి పోరాటాలు ఐక్యతవైపు మళ్లాలి
- సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీలో ఏప్రిల్ ఐదో తేదీన తలపెట్టిన కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల ప్రదర్శన జయప్రదం చేసేందుకుగానూ క్షేత్రస్థాయికెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు ఆ యూనియన్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిద్ధిపేటలోని మల్లు స్వరాజ్యం నగర్‌లోని సున్నం రాజయ్య ప్రాంగణంలో జరుగుతున్న సిఐటియు రాష్ట్ర నాలుగో మహాసభనుద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్రంలో కార్పొరేట్ల, మతోన్మాద అనుకూల ప్రభుత్వం అధికారంలో ఉందని విమర్శించారు. సంపద సృష్టికర్తలు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలేనని చెప్పారు. అయితే, సంపద వారికి దక్కకుండా కార్పొరేట్ల వద్ద పోగవుతుందని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒకే సమయంలో నయాఉదారవాద, విచ్ఛిన్నకర విధానాలను వేగంగా తీసుకొస్తున్న తీరును వివరించారు. ఈ విధానాల వల్లనే దేశంలో పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, సామాజిక, ఆర్థిక అసమానతలు, ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలు వేగంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా ఇటీవల పోరాటాలు ఉధృతం అవుతున్నాయని చెప్పారు. అయితే, ఈ అంశాలపై విడివిడిగా జరుగుతున్న పోరాటాలు పాలకుల కళ్లు తెరిపించలేకపోతున్న నేపథ్యంలో ఐక్య ఉద్యమాలకు ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులు ఏవిధంగా నష్టపోతున్నారనే అంశాన్ని క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను చైతన్యపర్చాల్సిన అవసరం ఉందనీ, దాన్ని సిఐటియు లీడ్ చేయాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో స్థానికంగా వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నాయకులు తమ వంతు కృషి చేసి ప్రజల నుంచి విశ్వాసం పొందాల్సిన అవసరం ఉందని సూచించారు. చెన్నై మహాసభలో తీర్మానించిన మేరకు ధిక్కరణ, ప్రతిఘటన నినాదంతో ముందుకు సాగాలను శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అనే విషయాల్లో కేంద్రంతో లాలూచీ పడుతున్నాయని చెప్పారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై ఐక్యపోరాటాల ద్వారా అటు జగన్, ఇటు కేసీఆర్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అనివార్యంగా కార్మికుల వైపు మాట్లాడేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అఖిల భారత అధ్యక్షులు హేమలత, ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశ్, ఎస్వీ.రమ, భూపాల్, మధు, రాగుల రమేశ్, బీరం మల్లేశ్, ఎజె రమేశ్, త్రివేణి, యాదానాయక్, చంద్రశేఖర్, ఎం.వెంకటేశ్, ఉపాధ్యక్షులు పి రాజారావు తదితరులు పాల్గొన్నారు.



ట్రిబుల్ ఆర్ భూసర్వేను అడ్డుకున్న నిర్వాసితులు

- పోలీసుల భారీ బందోబస్తు
- నిర్వాసితుల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రిభువనగిరి జిల్లా పరిధిలోని రాయగిరిలో ట్రిబుల్ ఆర్ భూసర్వే చేస్తున్న అధికారులను గురువారం నిర్వాసిత రైతులు అడ్డుకున్నారు. రూరల్ సిఐ వెంకటయ్య, ఎస్ఐ హెచ్ రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో సుమారు వందమంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భూ నిర్వాసితుల్లో ముఖ్యమైన రైతులను ఇంటి వద్ద అరెస్టు చేశారు. రాయగిరి, కేసారం, పెంచికల పహాడ్, తుక్కాపూర్, గౌస్ నగర్ గ్రామాలలో అధికారులు సర్వే పూర్తి చేశారు. అనంతరం భూ నిర్వాసితులందరూ కుటుంబీకులతో కలిసి యాదాద్రి కలెక్టర్ కార్యాలయం ముందు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వరంగల్ హైవే వైపు దూసుకు వచ్చే ప్రయత్నం చేశారు. వారిని భువనగిరి టౌన్, రూరల్, బొమ్మలరామారం పోలీసుస్టేషన్లకు తరలించారు. భువనగిరి పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి రైతులకు మద్దతు తెలిపి మాట్లాడారు. రాయగిరి గ్రామస్తులు గతంలో రోడ్డు నిర్మాణం కోసం, విద్యుత్తు లైన్ కోసం, ప్రణహిత చేవెళ్ల కాల్వ కోసం మూడు నుంచి నాలుగు సార్లు భూమిని కోల్పోయారని, మళ్లీ రాయగిరి గుండా ట్రిబుల్ ఆర్ రోడ్డు పోవడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నట్టు తెలిపారు. ట్రిబుల్ ఆర్ భూనిర్వాసితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తంగేళ్లపల్లి రవికుమార్, పల్లెర్ల యాదగిరి, అవి శెట్టి పాండు, వైకుంఠం, ఆంజనేయులు, మహేందర్ రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రేపే సెస్ పోలింగ్

- 15 డైరెక్టర్ స్థానాలకు.. బరిలో 75 మంది అభ్యర్థులు
- ఇప్పటికే 87130 మంది ఓటర్ల గుర్తింపు
- ఓటర్లలో యువత సంఖ్య నామమాత్రమే!
- 15 మండలాల్లో విస్తృతంగా ఆయా పార్టీల ప్రచారం
- జోరందుకున్న సిట్టింగ్‌లు, మద్యం, డబ్బు ప్రవాహం
- కెటిఆర్ ఇలాకాలో సత్తా చాటేందుకు విపక్షాల విశ్వప్రయత్నాలు
- వారం ముందే సిరిసిల్ల జిల్లా రైతుల ఖతాల్లో 'రైతుబంధు' జమ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ (సెస్)కు రేపు పోలింగ్ జరగనుంది. 15 డైరెక్టర్ స్థానాలకు 75 మంది అభ్యర్థులు బరిలో నిలవగా.. ప్రచారం హోరాహోరీగా సాగింది. ట్రాన్స్‌కో నుంచి విద్యుత్తును కొనుగోలు చేసి తమ పరిధిలోని వినియోగదారులకు విక్రయించే ఈ సహకార సంస్థ పరిధిలో సమైక్యాంధ్రలో 40వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. తెలంగాణలో ఈ ఎనిమిదేళ్ల కాలంలో రెండు లక్షల 81వేలకు చేరుకుంది. ఒకప్పుడు 200 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం ఉండగా.. ఇప్పుడు 900 మిలియన్ల విద్యుత్ వాడకం జరుగుతున్న ఈ సంస్థ పాలకవర్గాన్ని ఆయా పార్టీలు దక్కించుకునేందుకు ఎన్నికల్లో పెట్టే ఖర్చు అంతా ఇంతా కాదు.. ఏకంగా ఓటర్లుగా ఉన్న విద్యుత్ కనెక్షన్ వినియోగదారుల బకాయిలూ చెల్లించి వారి మెప్పుకు పోటీపడ్డాయి. ఇదేగాకుండా, ఎన్నికల కోలాహలం ప్రారంభమైన నెల రోజుల నుంచి జోరుగా సిట్టింగ్‌లు నిర్వహిస్తుండగా.. మద్యం, డబ్బులను ఏరులై పారిస్తున్నారు. ఇందులో అధికార పార్టీ కొంత ముందంజలో ఉండగా.. ఎలాగైనా సెస్ పీఠాన్ని దక్కించుకునేందుకు విపక్షపార్టీలూ విశ్వప్రయత్నాలే చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 28 న రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రైతుబంధు ఇస్తామని ప్రకటించిన సర్కారు రాజన్నసిరిసిల్ల జిల్లాలో సెస్ పరిధిలోని రైతులకు ఈ నెల 21నే జమ చేయడం గమనార్హం.

అభివృద్ధి పథంలో సెస్

1970 నవంబర్ 1న గ్రామీణ విద్యుద్దీకరణలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం ప్రారంభమైంది. సభ్యుల వాటాధనంతో ఏర్పాటు చేసిన ఇలాంటి సంస్థలే ఉమ్మడి రాష్ట్రంలో 9సంఘాలు ఉండేవి. అయితే, అవన్నీ ఇప్పుడు కనుమరుగు కాగా రాష్ట్రంలో సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ ఒక్కటే మిగిలింది. దినదినాభివృద్ధి చెందుతూ అంతర్జాతీయ ఖ్యాతిని గడించి తనకు ఒక ప్రస్థానాన్ని సంపాదించుకుంది. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల్లో విద్యుత్ సేవలందించిన సంస్థ పరిధిలో 2014కు ముందు లక్షలోపు విద్యుత్తు కనెక్షన్లు ఉండగా.. ఇప్పుడు ఏకంగా రెండు లక్షల పైచీలుకు కనెక్షన్లు ఇచ్చింది. ట్రాన్స్‌కో నుంచి విద్యుత్తును కొనుగోలు చేసి తన పరిధిలోని వినియోగదారులకు విక్రయిస్తుంది. వ్యవసాయ రంగానికి 630, గృహాలకు 158, వాణిజ్యం 26, పరిశ్రమలు 36, మరమగ్గాలకు 27, వీధి దీపాలు ఐదు, నీటి సరఫరా 12, సాధారణం రెండు మిలియన్ యూనిట్లను అమ్ముతోంది. ప్రస్తుతం రెండు గ్రామాలకో సబ్‌స్టేషన్ నిర్మించింది. ఒకప్పుడు ఈ జిల్లాకు కరెంటు సరఫరా చేసేందుకు కరీంనగర్ జిల్లాలోని దుర్శేడ్ వద్ద 220 కేవీకి అనుసంధానంగా ఉండేది. ఇప్పుడు జిల్లాలోనే రూ.వంద కోట్లతో సిరిసిల్ల 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. ఒకప్పుడు కరెంటు కష్టాలతో అల్లాడిపోయిన సెస్ ఇప్పుడు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించగలుతోంది.

జోరుగా సిట్టింగ్‌లు.. మద్యం, డబ్బుల ప్రవాహం

సెస్ పరిధిలో 15 డైరెక్టర్ స్థానాలకు అధికారపార్టీ అభ్యర్థులను బలపరిచింది. ఆ మేరకు జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు ప్రచారంలోకి దిగారు. స్థానిక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కెటిఆర్ సైతం రెండ్రోజులపాటు జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. మంత్రి ఇలాకాలోని సెస్‌ను ఎలాగైనా దక్కించుకునేందుకు విపక్ష పార్టీలూ ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే, ఇందులో ప్రధానంగా మద్యం, డబ్బులనే ఎరగా వేస్తూ జోరుగా సిట్టింగ్‌లను నిర్వహిస్తున్నారు. రేపే ఎన్నికల పోలింగ్ ఉండగా.. గురు, శుక్రవారాల్లో జోరుగా డబ్బులు పంపిణీ చేశారు. అయితే, ఏ ఎన్నికల్లోనైనా యువత ఓటే కీలకంగా ఉండేది. సెస్ పరిధిలో ఉన్న ఓటర్ల లిస్టులో యువత పాత్ర ఏమాత్రమూ లేదనే చెప్పవచ్చు. మొత్తం 87130మంది ఓటర్లలో ఐదు శాతమే యువకులు ఉండటం గమనార్హం. ఏదేమైనా రేపు జరగబోయే పోలింగ్‌లో అభ్యర్థుల భవితవ్యం సహా ఆయా పార్టీల ఎత్తుగడలు ఏమేరకు ఫలించనున్నాయో పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపుతో తేలనున్నాయి.

నిజాలు చెబితే భయమెందుకు?


- చంద్రబాబుపై విమర్శలు సరికాదు
- పరేడ్‌గ్రౌండ్స్‌లో సింహగర్జన పెడతా
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగుదేశం వాస్తవాలు చెబుతుంటే ఎందుకు భయపడుతున్నారని ఆ పార్టీ తెలంగాణ శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అధికార పార్టీ బిఆర్ఎస్ నాయకత్వాన్ని ప్రశ్నించారు. ఖమ్మం శంఖారావం సభలో గతంలో టిడిపి చేసిన పనులనే మా పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు చెప్పారనీ, మీ మీద విమర్శలు చేయలేదు కదా? అని వ్యాఖ్యానించారు. ఒక్క మీటింగ్‌కే ఎందుకంత భయం ? ఇక ముందు మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా సభలు పెట్టనున్నామని స్పష్టం చేశారు. కార్యకర్తలు ఎక్కడికి రమ్మంటే అక్కడికి పోతాం, ముందు ముందు సిద్ధిపేట, గజ్వేల్, సిరిసిల్లల్లో కూడా మీటింగ్‌లు పెడతామని అన్నారు. తెలుగుదేశం నుంచి నాయకులు మాత్రమే వెళ్లారనీ, కార్యకర్తలు కాదని అన్నారు. ఖమ్మం బహిరంగ సభ ద్వారా టిడిపి పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణ మరోసారి బయటపడిందని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువత సభకు రావడం సంతోషంగా ఉందన్నారు. తండోపతండాలు వచ్చి సభను విజయవంతం చేసినందుకుగాను రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు చెబుతున్నట్టు చెప్పారు. చంద్రబాబు సభను విజయవంతం చేసిన పార్టీ నాయకత్వానికి, ఖమ్మం జిల్లా యంత్రాంగానికి ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ నుంచి భారీగా జనం తరలివచ్చారని పేర్కొన్నారు. సభలు పెట్టేది కాసాని జ్ఞానేశ్వర్, మా అధ్యక్షుడిని నేనే పిలుచుకున్నా అని స్పష్టం చేశారు. అందరం ఇక్కడి నుంచి వెళ్లిన వాళ్లమే, ఈ క్లాస్‌లో చదివినవాళ్లమేనని గుర్తు చేశారు. మంచి చేస్తే మంచి, చెడు చేస్తే చెడు చెబుతామనీ, ప్రజల తరపున మాట్లాడతాం, కొట్లాడతామని అన్నారు. హైదరాబాద్‌లో ఐటి అభివృద్ధి జరిగింది చంద్రబాబు వల్లేనని అసెంబ్లీ సాక్షిగా కెటిఆర్ చెప్పలేదా ? కెసిఆర్ చెప్పారని గుర్తు చేశారు. మరి ఎందుకంత రాద్ధాంతం అని ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన పనులనే చెప్పాడనీ, చేయనివి కాదని అన్నారు. ఒకవేళ మీరు చేయలేదని చెబుతారా ? అని సవాల్ విసిరారు. ఖమ్మం సభ ఆరంభమేననీ, సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో సింహగర్జన పెడతానని స్పష్టం చేశారు. బిఆర్ఎస్‌కు లోకల్ స్టాండ్ లేదని, టిఆర్ఎస్ పోయి బిఆర్ఎస్ అయ్యాకా ? ఇంకేముంటుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో 119 సీట్లల్లో ఢంకా భజాయిస్తామని చెప్పారు. మునుగోడు ఎన్నికల్లో పోటీ చేయరాదని అనుకున్నామని, వచ్చే సాధారణ ఎన్నికల కోసమే సిద్ధమవుతున్నామని చెప్పారు. పేద ప్రజలు తమ సమస్యలపై పెట్టుకున్న 28 లక్షల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో పెనుమార్పులు రాబోతున్నాయని తెలిపారు. విలేకర్ల సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్, సీనియర్ నాయకులు కాట్రగడ్డ ప్రసూన, అట్లూరి సుబ్బారావు, రఘు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతో ముందుకు వెళ్తాం...

- వ్యవసాయ కార్మికుల పక్షాన పోరాడుతాం..
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి నాగయ్య



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు పోరాటాలే మార్గమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. వెంకటాపురంలోని స్థానిక మార్కెట్ యార్డులో గురువారం సంఘం ములుగు జిల్లా ప్రథమ మహాసభ కుమ్మరి శ్రీను, గ్యానం వాసు అధ్యక్షతన సున్నం రాజయ్య నగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఎనిమిదేండ్ల పాలనలో వ్యవసాయ రంగం దివాళా తీసిందన్నారు. వ్యవసాయ రంగానికి, రైతాంగానికి, కార్మికులకు, మధ్యతరగతి ప్రజలకు వ్యతిరేకంగా ఎన్నో చట్టాలను తీసుకొచ్చారని విమర్శించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని మూలాలైన ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక న్యాయాలను దెబ్బ కొట్టే ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రాలకు ఉన్న హక్కులను హరిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తున్నారని, రోడ్లు, రైళ్లు, విమానాలు, ఖనిజసంపద ప్రయివేటు పెట్టుబడులకు కట్టబెట్టే ప్రయత్నాలు మొదలు పెట్టిందని చెప్పారు. నిత్యావసర ధరలు పెంచి సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ, కార్మిక వర్గానికి అండగా ఉంటున్న ఉపాధిహామీ ద్వారా కనీసం వంద రోజుల పని కల్పించాలని కోరారు. రోజుకు సరిపడా జీతం ఇవ్వకుండా ఉపాధిని నీరు గార్చే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. వ్యవసాయ కార్మిక చట్టం, ఉపాధి హామీ చట్టంతోపాటు కూలీ, నిధులు కేటాయించాలని, పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతన చట్టం ఏమైందని విమర్శించారు. రాష్ట్రంలో 80 లక్షల నుంచి కోటి మంది వ్యవసాయ కూలీలు ఉన్నారని, వారికి సొంత ఇళ్లు లేవన్నారు. తొలుత మండల శివారులోని శివాలయం నుంచి మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.



మీడియాతో మాట్లాడుతున్న విజయ్ కుమార్

హైదరాబాద్‌లో 600 అవుట్‌లెట్‌లు లక్ష్యం

సుప్రీమ్ సూపర్ ఫుడ్స్ విస్తరణ

ప్రజాశక్తి-హైదరాబాద్

సుప్రీమ్ సూపర్ ఫుడ్స్‌ను హైదరాబాద్‌లో 600 స్టోర్లలో అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ సంస్థ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వైబి విజయ్ కుమార్ తెలిపారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీమ్ ఫార్మాకు చెందిన తమ బ్రాండ్ ఇప్పటికే పలు మెట్రో నగరాల్లో సుప్రీమ్ సూపర్ ఫుడ్స్‌కు చెందిన నార్మ లైఫ్, నార్మా హెల్త్ వేరియంట్లలో 50 ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చామన్నారు. తాజాగా వీటిని హైదరాబాద్‌కు విస్తరించామన్నారు. రానున్న రోజుల్లో దేశ వ్యాప్తంగా పది వేల పైగా స్టోర్లలో తమ ఉత్పత్తులను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో తమ సంస్థ రూ.14 కోట్ల టర్నోవర్ నమోదు చేసిందని.. తాజా విస్తరణతో వచ్చే ఏడాది రూ.వంద కోట్ల అమ్మకాలు లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

ఎయిర్‌టెల్, అపోలో హాస్పిటల్స్ జట్టు

- ఎఐతో కొలోనోస్కోపి ట్రయల్

న్యూఢిల్లీ : టెలికం సేవల కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ ప్రముఖ వైద్య సేవల సంస్థ అపోలో హాస్పిటల్స్ జట్టు కట్టాయి. దీని ద్వారా దేశంలోనే తొలిసారి 5జిని ఉపయోగించుకుని కృత్రిమ మేధస్సు (ఎఐ)తో పెద్ద పేగు గుట్టు విప్పే కొలోనోస్కోపీ ట్రయల్ చేయనున్నట్లు వెల్లడించాయి. ఈ కొలొనోస్కోపిలో ఖచ్చితత్వం మరింత పెరగనుందని తెలిపాయి. ఈ పరీక్షల్లో హెల్త్‌నెట్ గ్లోబల్, ఎడబ్ల్యుఎస్, ఆవేశ సంస్థలనూ భాగస్వామ్యం అవుతున్నాయని పేర్కొన్నాయి.

బిఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి : ఇంద్రకరణ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్)తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి ఎ ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. బిఆర్‌ఎస్ పార్టీ విస్తరణలో భాగంగా మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బోకర్ నియోజకవర్గంలోని కిని గ్రామంలో ఆయన గురువారం పర్యటించారు. రైతులు, వివిధ వర్గాల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో అమలవుతున్న పథకాలన్నీ దేశమంతా అమలవుతాయని అన్నారు. సిఎం కెసిఆర్ తెలంగాణను అనతికాలంలోనే కనీవినీ ఎరుగనిరీతిలో అభివృద్ధి చేశారని వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు.

దేశ ప్రజలందరికీ ఈ పథకాలు అమలు చేసి అన్ని రంగాల్లో భారతదేశాన్ని అభివృద్ధి చేసేందుకే బిఆర్‌ఎస్‌ను స్థాపించారని గుర్తు చేశారు. మహారాష్ట్రలో ఊరూరా బిఆర్‌ఎస్‌ను విస్తరిస్తామని చెప్పారు. త్వరలో ప్రతి జిల్లాలో తాలూకా, గ్రామస్థాయి వరకు పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని వివరించారు. మహారాష్ట్ర ప్రజలు బిఆర్‌ఎస్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాందేడ్ జిల్లాకు చెందిన ప్రముఖ నాయకులు రమేష్ రాథోడ్, సునీల్‌కుమార్ బజాజ్, అశోక్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐఐఎంసిలో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఆవిష్కరణలు, సృజనాత్మకత, సాంకేతిక సమాచారంతో కూడిన 21వ శతాబ్దపు నైపుణ్యాలు ప్రధాన అంశంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసి) ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు దాదాపు 9 పరిశోధనా పత్రాలను సమర్పించనున్నట్లు ఐఐఎంసి కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు.

కల్లాలపై కొట్లాట
కేంద్రం వర్సెస్ రాష్ట్రం

- నిధులు తిరిగివ్వాలని కేంద్రం మెలిక
- నిజామాబాద్‌లో 1193 నిర్మాణాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కారు.. రాష్ట్రంలోని టిఆర్‌ఎస్ సర్కారు మధ్య మరో యుద్ధానికి తెరలేచింది. జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం(ఎన్‌ఆర్‌ఇజిఎస్)లో భాగంగా రాష్ట్ర సర్కారు నిర్మించిన రైతు కల్లాల నిధులు తిరిగివ్వాలని తాజాగా కేంద్రం మెలిక పెట్టింది. ఈ పనులు ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిబంధనలకు వ్యతిరేకంగా కల్లాలకు దుర్వినియోగం చేశారని అభియోగించింది. దీనిపై రాష్ట్ర సర్కారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బిఆర్‌ఎస్ సర్కారును ఉద్దేశపూర్వకంగా ఇబ్బందుల పాల్జేసేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించింది. మోడీ సర్కారు రైతు వ్యతిరేక ప్రభుత్వమని మంత్రి వేముల ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో చేపలు ఎండబెట్టేందుకు కల్లాలు నిర్మిస్తే అభ్యంతరం తెలపని కేంద్రం, రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం కల్లాలు నిర్మిస్తే అభ్యంతరమేంటని ప్రశ్నిస్తోంది. దీనిపై నేడు జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదుట రైతు ధర్నాకు పిలుపునిచ్చింది.

రాష్ట్రంలో రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయడం వల్ల ప్రమాదాలు జరుగుతుండటంతో రాష్ట్ర సర్కారు రైతు కల్లాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అవసరమైన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరింది. నిజామాబాద్ జిల్లాకు మొత్తం 3,278 రైతు కల్లాలు మంజూరయ్యాయి. అయితే జిల్లాలో మెజార్టీ చిన్న, సన్నకారు రైతులు ఉండటంతో కల్లాల నిర్మాణానికి పెద్దగా ఆసక్తి చూపలేదు. ఉన్న సాగు భూమి తక్కువగా ఉండటంతో మళ్లీ కల్లాలు నిర్మిస్తే.. మరింత స్థలం కోల్పోవాల్సి వస్తుందని భావించి వెనక్కి తగ్గారు. జిల్లాలో 3,278 కల్లాలు మంజూరయినా..1193 నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 941 నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో రూ.11.81 కోట్లు ఖర్చు చేశారు. కానీ ఈ పనులపై తాజాగా కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేముల

కల్లాలు నిర్మించడం ఈ పథకంలో మార్గదర్శకాలకు వ్యతిరేకమని పేర్కొంది. పైగా రైతు కల్లాలకు వినియోగించిన నిధులను వెనక్కి ఇవ్వాలని స్పష్టం చేసింది. ఇప్పటికే పలు అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలు రాజుకుంటుండగా.. తాజాగా ఆ స్థానంలో రైతు కల్లాలు చేరాయి. ధాన్యం కొనుగోలు విషయంలోనూ గతంలో వివాదం చెలరేగిన విషయం తెలిసిందే.

కేంద్ర తీరుకు వ్యతిరేకంగా రైతు ధర్నా : టిఆర్‌ఎస్

కేంద్రంలోని మోడీ సర్కారు రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా నేడు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదుట రైతు ధర్నా చేపట్టనున్నట్టు టిఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. ఈ మేరకు గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణేష్‌గుప్తా, ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. ముందుగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కెసిఆర్ సర్కారు రైతుల కోసం పలు సంక్షేమ పథకాలు అవలంబిస్తోందని, రైతుల్లో మంచిపేరు వస్తుండటంతో ఓర్వలేక కుట్రలకు తెరలేపిందని ఆరోపించారు. అందులో భాగంగానే రైతు కల్లాలు నిర్మిస్తే ఆ నిధులు తిరిగివ్వాలని మెలిక పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో చేపలు ఆరబెట్టుకునేందుకు ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో ఫ్లాట్‌ఫామ్‌లు నిర్మిస్తే అభ్యంతరం తెలపలేదని, కానీ రాష్ట్రంలో రైతుల కోసం కల్లాలు నిర్మిస్తే ఓర్వలేకపోతోందని ఆరోపించారు. ఇక కేంద్రంలోని మోడీ సర్కారు ఇడి, సిబిఐలతో బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో దాడులు చేయిస్తోందని, అందులో భాగంగానే టిఆర్‌ఎస్ నాయకులపై వరుసదాడులని ఎమ్మెల్యేలు ఆరోపించారు.

బిజెపి చర్యలకు భయపడబోమని అన్నారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... చౌకీదార్ సర్కారు అంటూ బ్యాంకులు కొల్లగొట్టిన కార్పొరేట్లను బిజెపి సర్కారు దేశం దాటించిందని ఆరోపించారు. దేశానికి ప్రస్తుతం కావాల్సింది నిద్రపోయే చౌకీదార్లు కాదని, జిమ్మేదార్ నేతలన్నారు. కేంద్రంలోని మోడీ సర్కారు పెట్టుబడిదారుల, బడా కార్పొరేట్లకు సంబంధించి రూ.19 లక్షల కోట్లు రుణాలు మాఫీ చేసిందని ఆరోపించారు. నేడు నిజామాబాద్‌లో చేపట్టే రైతు దీక్షకు పెద్దఎత్తున రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

కల్లాలపై కేంద్రం దుష్ప్రచారానికి వ్యతిరేకంగా నేడు రాష్ట్రవ్యాప్త ధర్నాలు

- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్లాల కోసం రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన సహాయంపై కేంద్రంలోని బిజెపి సర్కారు చేస్తున్న దుష్ప్రచారానికి వ్యతిరేకంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిరామారావు ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడే కల్లాల నిర్మాణాలపై కేంద్రం కావాలనే రాద్ధాంతం చేస్తున్నదని గురువారం ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. పంట కల్లాలను కడితే కేంద్రానికి ఎందుకు కడుపు మంటని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్నదాత కోసం కల్లాలు నిర్మిస్తే మోడీ సర్కారు కండ్లలో నిప్పులు పోసుకుంటున్నదని విమర్శించారు. రైతులకు అత్యంత ఉపయోగపడే వ్యవసాయ కల్లాలపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. రైతులకు కలుగుతున్న ప్రయోజనాన్ని పట్టించుకోకుండా కేవలం తెలంగాణ ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనిలో బిజెపి ఉందని తెలిపారు. చేపలు ఆరబెట్టుకునేందుకు ఇతర రాష్ట్రాల్లో నిర్మిస్తున్న కల్లాలకు అభ్యంతరం చెప్పని మోడీ సర్కారు తెలంగాణ రైతులు కట్టుకున్న కల్లాలను ఎందుకు వ్యతిరేకిస్తున్నదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ఏండ్ల నుంచి కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని గుర్తు చేశారు. వ్యవసాయ రంగంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్ర రైతుల ప్రగతిని ఓర్వలేకనే కేంద్రం కక్షకట్టిందని విమర్శించారు.

ప్రతిష్టాత్మకంగా ఆయిల్ ఫామ్ సాగు

- రైతులకు విరివిగా రుణాలివ్వాలి
- నాబార్డు సమావేశంలో మంత్రి హరీష్ రావు
- వచ్చే వారం 'రైతు బంధ్' పంపిణీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకొని సాగుకు మద్దతునిస్తుందని..ఇందుకు సంబంధించి రైతులను ప్రోత్సహించేందుకు విరివిగా రుణాలు ఇవ్వాలని మంత్రి హరీశ్‌రావు కోరారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన నాబార్డ్ వార్షిక రుణ ప్రణాళిక సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరిసాగు భారీగా పెరుగుతున్నదని, దీంతో కూలీల సమస్య పెరిగి రైతుకు పెట్టుబడి భారం అధికమవుతుందన్నారు. దీన్ని నివారించేందుకు గానూ వరిసాగులో నాట్లు వేసేందుకు యాంత్రీకరణను ప్రోత్సహించి యంత్రాలను అందించాలన్నారు. దీంతో పాటు ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు ఇవ్వాలని నాబార్డ్‌ను కోరారు. ఇది పారిశ్రామికవేత్తలకు ఉపయోగపడంతో పాటు రైతులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇప్పటికే అనేక పథకాలకు రుణ సహాయం చేసిన నాబార్డ్ సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టుకు రుణం ఇవ్వాలని నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతలను కోరారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే సంగారెడ్డి జిల్లా ప్రాంతంలోని రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

సిఎం కెసిఆర్ అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలతో తెలంగాణ వ్యవసాయరంగం దేశానికి రోల్ మోడల్‌గా మారిందన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను కేంద్ర ప్రభుత్వం ఇతర పేర్లతో దేశ వ్యాప్తంగా అమలు చేస్తుందన్నారు. మిషన్ కాకతీయ పథకాన్ని అమృత్ సరోవర్ పేరుతో, రైతుబంధు పథకాన్ని పిఎం కిసాన్ పేరుతో అమలు చేస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రంలో సాగు భూమి, పంటల ఉత్పత్తి భారీగా పెరిగిందన్నారు. నాబార్డ్‌తో కలిసి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. కాళేశ్వరం, చెక్ డ్యాంల నిర్మాణం, మైక్రో ఇరిగేషన్, గోదాముల నిర్మాణం ఇలా పలు కార్యక్రమాలకు నాబార్డ్ రుణాలు అందించి సహకరించిందన్నారు. ప్రతి మండలానికి ఒక గోదాము ఉండేలా చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించినప్పుడు నాబార్డ్ సహాయంతో గోదాములను నిర్మించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాగు విస్తీర్ణం, ధాన్యం దిగుబడి భారీగా పెరిగిందన్నారు. సాగు విస్తీర్ణం 1.34 కోట్ల ఎకరాల నుంచి 2.03 కోట్ల ఎకరాలకు పెరిగిందని, అదే విధంగా ధాన్యం ఉత్పత్తి 68 లక్షల టన్నుల నుంచి 2.49 కోట్ల టన్నులకు చేరిందని మంత్రి తెలిపారు. గతంలో ముందు జాగ్రత్తగా నాబార్డ్‌తో కలిసి గోదాములు ఏర్పాటు చేయడంతో ఇప్పుడు ధాన్యం నిల్వలకు ఇబ్బంది కలుగడం లేదన్నారు. అదే విధంగా అవసరమైన ఎరువులను ముందుగానే తీసుకొచ్చి గోదాముల్లో నిల్వ చేయడం వల్ల రైతులకు సరైన సమయంలో ఎరువులను అందిస్తున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలో ఎరువుల కోసం క్యూలైన్లలో ఉండి రైతులు చనిపోయిన ఘటనలు చూస్తున్నామన్నారు. దేశంలో వ్యవసాయరంగానికి మరే రాష్ట్రం ఖర్చు చేయని విధంగా తెలంగాణ రాష్ట్రం భారీగా నిధులను వెచ్చించిందన్నారు.

జైని మల్లయ్యగుప్తా మరణం పట్ల సిపిఎం సంతాపం

- భౌతికకాయానికి చెరుపల్లి నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు జైని మల్లయ్య గుప్తా (93) బుధవారం రాత్రి వయోభారంతో మృతి చెందారు. ఆయన మరణం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. ఆయన కుటుంబ సభ్యులకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సానుభూతిని తెలిపారు. హైదరాబాద్‌లోని మల్లయ్యగుప్త కుమారుని ఇంట్లో మల్లయ్య గుప్తా భౌతికకాయాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు గురువారం సందర్శించి నివాళులర్పించారు. భువనగిరిలో జన్మించిన మల్లయ్య గుప్తా ఆంధ్ర మహాసభ ఉద్యమానికి ఆకర్షితులై కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్మి పనిచేశారని తెలిపారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి అనేక కేసులను ఎదుర్కొన్నారని వివరించారు. జైలు జీవితం గడిపారని, తెలంగాణ విమోచనం తర్వాత భువనగిరి పురపాలక సంఘానికి తొలి చైర్మెన్‌గా ఆయన ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు.

సిపిఐ దిగ్భ్రాంతి

జైని మల్లయ్య గుప్తా మరణం పట్ల సిపిఐ రాష్ట్ర సమితి దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఆయన నిబద్ధతగల కమ్యూనిస్టు నాయకుడని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. జైని మల్లయ్య గుప్తా నిబద్ధతకు మారుపేరని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ తెలిపారు. చివరి వరకూ కమ్యూనిస్టు పార్టీ పట్ల అంకితభావంతో ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణ అమరవీరుల స్మారక భవనం స్వాధీనం చేసుకోవాలంటూ నిరవధిక దీక్షకు సైతం సిద్ధపడ్డారని గుర్తు చేశారు. ఆయన ఆశయాన్ని సాధించేందుకు సన్నద్ధమవుదామని తెలిపారు. ఈనాటి తరానికి ఆయన జీవితం ఆదర్శమని జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.



భువనగిరిలోని ఇల్లును పార్టీ కార్యాలయానికి ఇచ్చిన గొప్ప త్యాగశీలి అని ఆయన సేవలను కొనియాడారు. మల్లయ్య గుప్తా మరణం బాధాకరమని సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయనతో తనకు 50 ఏళ్ల అనుబంధముందని వివరించారు. తెలంగాణ అమరవీరుల ట్రస్టు సమావేశాలకు గుప్తా హాజరయ్యేవారని పేర్కొన్నారు.

పలువురి నివాళి

జైని మల్లయ్య గుప్తా భౌతికకాయాన్ని సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసంహారెడ్డి, టిజెఎస్ అధ్యక్షులు కోదండరామ్, ప్రజాపక్షం సంపాదకులు కె శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ విద్యావేత్త ఎస్‌వి సత్యనారాయణ, తెలంగాణ మీడియా అకాడమి చైర్మెన్ అల్లం నారాయణ, తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరి గౌరీశంకర్, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు.

పార్టీని రోడ్డున పడేస్తారా..!

- సీనియర్లపై దిగ్విజయ్ సింగ్ ఆగ్రహం
- రేవంత్‌ను భరించలేం...
- మీడియా ఎదుట పార్టీని బదనాం చేస్తున్నారు
- ఇరువర్గాల ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కష్ట కాలంలో పార్టీ అండగా ఉండాల్సిన సీనియర్లు పార్టీ బజారుపాల్జేస్తారా? అంటూ ఎఐసిసి ప్రధాన కార్యదర్శి దిగ్విజయ్‌సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీని రక్షించాల్సిన మీరే... సమస్యగా మారితే ఎలా? ఏవైనా సమస్యలు ఉంటే అధిష్టానం దృష్టికి తీసుకురావాలిగానీ, మీడియా ఎదుట బహిర్గతం చేయడం ద్వారా ఏం సాధిస్తారంటూ ప్రశ్నించినట్టు తెలిసింది. ఇటు సీనియర్లు, అటు రేవంత్ గ్రూప్ దిగ్విజయ్ ఎదుట పరస్పర వాదనలు వినిపించారు. ఒక్కరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నట్టు తెలిసింది. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ సీనియర్లతో దిగ్విజయ్‌సింగ్ గురువారం సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్‌లో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఎఐసిసి దూతగా ఆయన హైదరాబాద్‌కు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి ఆయన సీనియర్ నేతలను పిలిపించి మాట్లాడారు. పార్టీలో కీలక పదవుల్లో ఉన్న నేతలు కూడా కమిటీలపై అసంతృప్తి వ్యక్తం చేయడాన్ని దిగ్విజయ్ తీవ్రంగా పరిగణించినట్టు తెలిసింది. నేతల అభిప్రాయాలను ఆయనే స్వయంగా నమోదు చేసుకున్నారు. అందరితో ఒకేసారి కాకుండా ఒక్కొక్కరితో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. పార్టీ నేతలు జానారెడ్డి, టి జీవన్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, భట్టి విక్రమార్క, సీతక్క, వి హనుమంతరావు, రేణుకా చౌదరి, షబ్బీర్ అలీ, బలరాంనాయక్, మహేశ్వర్‌రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, సురేష్‌షెట్కర్, జగ్గారెడ్డి తదితరులు ఆయన ఎదుట హాజరయ్యారు.

టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని భరించలేపోతున్నామంటూ కొందరు నేతలు డిగ్గీ ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆయన ఏకపక్ష నిర్ణయాలతో పార్టీ తీవ్రంగా నష్టపోతున్నదని వివరించారు. రేవంత్ తాను అనుకున్నదే పార్టీ కార్యక్రమంగా భావిస్తారనీ, తమ [illegible] విలువలేకుండాపోయిందంటూ సీనియర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ సమిష్టిగా నిర్ణయించిన కార్యక్రమాలను సీనియర్లు అమలు చేయరనీ, వివిధ సమస్యలపై పార్టీ ఇచ్చిన పిలుపులను వారు అమలు చేయరని రేవంత్ వర్గీయులు చెప్పినట్టు తెలిపారు. అంతేకాకుండా పార్టీ అంతర్గత విషయాలను కూడా బహిర్గతం చేస్తూ పార్టీని బలహీన పరిచే ఆలోచనలు చేస్తున్నారని ఆరోపించారు. సమిష్టి ఆమోదంతోనే నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తే...ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ఆదేశాలను సైతం ధిక్కరిస్తున్నారంటూ సీనియర్లపై ఫిర్యాదులు చేశారు.

దిగ్విజయ్ ప్రశ్నల వర్షం

'బిఆర్‌ఎస్‌ను ఓడించేందుకు మీ దగ్గర ఉన్న వ్యూహమేంటి? పార్టీ బలోపేతం కోసం మీ పాత్ర ఏంటి? మీరు ఏం చేశారు? అంతర్గత సమస్యపై మీ అభిప్రాయం చెప్పండి. వాటి పరిష్కారం కోసం మీరిచ్చే సలహాలేంటి? అంటూ దిగ్విజయ్ సీనియర్లపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'పార్టీలో జూనియర్, సీనియర్ పంచాయితీ మంచిది కాదు. సమస్యలు ఉంటే అధిష్ఠానం దృష్టికి తీసుకురావాలి. మీడియా ముందు మాట్లాడడం సరికాదు. కలిసికట్టుగా పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఎవరు ఏం చేస్తున్నారో అధిష్ఠానం గమనిస్తున్నది. ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తే... హై కమాండ్ చూస్తూ ఊరుకోదు' అంటూ హెచ్చరించారు. దిగ్విజయ్‌సింగ్‌తో భేటీ అనంతరం సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క గాంధీభవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ 'చాలా మంది సీనియర్ కాంగ్రెస్ నేతలకు రాష్ట్ర రాజకీయంపై సంపూర్ణ అవగాహన ఉంది. ఏ కాంగ్రెస్ నాయకుడు ఎప్పటి నుంచి ఉన్నారు?. ఎవరెవరు ఎలా పని చేస్తున్నారని అన్ని విషయాలు వారందరికి తెలుసు. వారితో సమకాలీన రాజకీయ, ఆర్థికపరమైన అంశాలు, సామాజిక అంశాలు వారితో చర్చించాం' అని చెప్పారు.

ఈ చావులు ఇంకెన్నాళ్లు...?

- గురుకుల ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించండి
- బిసి గురుకులాల పనివేళలను మార్చండి
- టిఎస్‌యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి చదువుల పేరుతో ఉపాధ్యాయులు, విద్యార్థులపై కలిగిస్తున్న తీవ్రమైన మానసిక ఒత్తిడిని నివారించాలనీ, విద్యార్థుల ఆత్మహత్యలు, ఉపాధ్యాయుల మరణాలను అరికట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఒత్తిడి వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయుల చావులు ఇంకెన్నాళ్లని ప్రశ్నించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకేసారి లెక్కకు మిక్కిలి గురుకుల పాఠశాలలను అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారని వారు తెలిపారు.

విద్యార్థులు అరకొర వసతి సౌకర్యాలతోనే సతమతమవుతున్నారని పేర్కొన్నారు. నైవాసిక విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులకు కూడా వసతి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని వివరించారు. కానీ గురుకులాల్లో సిబ్బందికి నివాస గృహాలు లేకపోగా కనీస విశ్రాంతి సౌకర్యాలు కూడా లేవని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలతో సహా రాత్రి వేళల్లో పర్యవేక్షక అధ్యయనం విధులు ముగించుకుని వెళ్లే సందర్భంలో ఉపాధ్యాయులు తరచుగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఆ క్రమంలోనే సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ బీసీ గురుకుల బాలికల పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపల్ గీత రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సందర్భంలో ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడి మరణించారని గుర్తు చేశారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు తీవ్రంగా గాయపడ్డారనీ, మరికొందరు మరణించారని పేర్కొన్నారు. పని ఒత్తిడి కారణంగా కొందరు గుండెపోటుతో మరణించారని తెలిపారు. ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు అన్ని సొసైటీల్లో పనివేళలు కొంత మార్పు చేసినప్పటికీ, మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల విద్యాసంస్థల పనివేళలు మాత్రం నైవాసిక పద్ధతిలో ఉదయం 6.45 నుంచి రాత్రి తొమ్మిది వరకు ఉండాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. వారంలో రెండు, మూడు రోజులు రాత్రిపూట బస (నైట్ డ్యూటీ) కూడా చేయాల్సి వస్తుందని వివరించారు. వారికి హౌస్ మాస్టర్, డిప్యూటీ వార్డెన్ తదితర విధులతో బోధన కంటే బోధనేతర పనులే అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకుల విద్యాసంస్థలు ఆశించిన ఫలితాలు సాధిస్తూ చిరకాలం మనగలగాలంటే ఉపాధ్యాయులను ఒత్తిడికి దూరం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బోధనేతర విధులను తగ్గించాలనీ, పాఠశాలలకు శాశ్వత వసతి కల్పించాలని సూచించారు. పాఠశాల ఆవరణలోనే ఉపాధ్యాయులకు నివాస వసతి కల్పించాలని తెలిపారు. అప్పటివరకు పనివేళల్లో మార్పు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చాలి

- బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి
- సింగరేణికివ్వాల్సిన బకాయిలను ఇవ్వాలి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు భూపాల్, ఎస్‌వి రమ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలనీ, లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు భూపాల్, ఎస్‌వి రమ హెచ్చరించారు. గురువారం సిద్దిపేటలోని మల్లుస్వరాజ్యంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్‌లో విలేకర్లతో భూపాల్ మాట్లాడుతూ.. సిఐటియు రాష్ట్ర నాలుగో మహాసభ ఆమోదించిన పలు తీర్మానాలను వివరించారు. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, ట్రైబల్ యూనివర్సిటీ, హార్టీకల్చర్ యూనివర్సిటీ, తదితర విభజన హామీలపై నెరవేర్చేదాకా సిఐటియుగా పోరాటం చేస్తామని చెప్పారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వస్తే స్థానికంగా 30 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీకి 90 వేల కోట్లు కేటాయిస్తే మైనింగ్ ప్రక్రియ ప్రారంభించవచ్చుననీ, దీనివల్ల ఏడెనిమిది జిల్లాల్లోని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ రెండింటి ద్వారా రాష్ట్ర అభివృద్ధి శరవేగంగా జరిగే అవకాశం ఉందన్నారు. ఎన్‌టిపిసి ద్వారా నాలుగువేల మెగావాట్ల విద్యుత్ తయారీ ప్లాంట్ ఏర్పాటు హామీనీ గాలికొదిలేసిందని విమర్శించారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను అణచివేసిందన్నారు. వెల్ఫేర్‌పేరుతో వేసిన కమిటీలన్నీ నిర్వీర్యంగా మారాయన్నారు. 2017, 2021 పేస్కేల్‌లను అమలు చేయాలనీ, సిసిఎస్, పిఎఫ్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సంస్థకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి డిపోల మూసివేతను ఆపేసి కొత్త బస్సులను సంస్థకు ఇవ్వాలని కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని నిర్వీర్యం చేసేందుకు పూనుకున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వమేమో ప్రయివేటు కంపెనీలకు బొగ్గుగనులను లీజుకిస్తూ పోతున్నదనీ, దీన్ని రాష్ట్ర ప్రభుత్వమూ అడ్డుకోవడం లేదని చెప్పారు. సింగరేణి కార్మికులకు చెల్లించాలని బకాయిలను, స్టేట్ పవర్ కార్పొరేషన్‌కు సరఫరా చేసిన బొగ్గుకు సంబంధించిన బకాయిలను చెల్లించాలని కోరారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. సామాజిక అసమానతలను తగ్గించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిల సంక్షేమం కోసం పెద్దగా ఖర్చుపెట్టడం లేదని చెప్పారు. ఎస్‌వి రమ మాట్లాడుతూ..స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని కోరారు. రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ పరిశ్రమలకు సంబంధించిన జిఓలను సవరించాలనీ, కార్మికుల కనీస వేతనం రూ.26వేలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్తున్న మూడున్నర లక్షల స్కీమ్ వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం సరిగాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పథకాలకు నిధులను తగ్గిస్తూ వాటిని ప్రయివేటు శక్తులకు కట్టబెట్టే కుట్రకు పూనుకుంటున్న తీరును వివరించారు. స్కీంవర్కర్లపై రాజకీయ, మానసిక ఒత్తిళ్లను, వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లందరికీ రిటైర్డ్ బెనిఫిట్స్, పిఎఫ్, ఇఎస్ఐ, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. రాష్ట్రంలో బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. బీడీ కార్మికులందరికీ జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు కార్యదర్శి గోపాలస్వామి, అధ్యక్షులు ఎల్లయ్య, సహాయ కార్యదర్శి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రచ్చ...రచ్చ

- గాంధీభవన్‌లో తోపులాట
- అనిల్‌పై ఒయు విద్యార్థి నేతల దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాంధీభవన్‌లో రచ్చ... రచ్చ అయింది. మాట, మాట పెరిగి తోపులాటకు దారి తీసింది. ఉద్రిక్తత చోటు చేసుకుంది. పార్టీ సీనియర్లు వ్యవహరిస్తున్న తీరుపై ఇటీవల మాజీ విప్ అనిల్ ఘాటైన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం దిగ్విజయ్‌సింగ్‌తో భేటీ అనంతరం గాంధీభవన్ నుంచి అనిల్ బయటకు వస్తున్న క్రమంలో ఆయనపై ఓయు విద్యార్థి నేతలు దాడికి యత్నించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. అక్కడే ఉన్న మల్లు రవి, ఇతర సీనియర్ నేతలు విద్యార్థులను అడ్డుకుని గొడవ సద్దుమణిగేలా చేశారు. ఎంతో కాలంగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నామనీ, అయినా, కమిటీల్లో తమకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదని విద్యార్థి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీభవన్ ఎదుట కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు. సేవ్ కాంగ్రెస్ అంటూ పదవులు రాని నేతలు నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే అనిల్‌ను బూతులు తిడుతూ ఓయూ కాంగ్రెస్ నేతలు దాడికి యత్నించారు. ఉత్తమ్‌ను తిడతావా అంటూ అనిల్‌పై మండిపడ్డారు. ఆయనపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇటీవల కాంగ్రెస్ జంబో కమిటీపై వస్తున్న విమర్శలకు అనిల్ సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా ఆయన ఉత్తమ్‌పై కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దిగ్విజయ్ సింగ్ ముందే నేతలు గల్లాలు పట్టుకున్నారు. సమావేశం నుంచి కొందరు నేతలు బయటకు వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

ఘర్షణపై అధిష్టానం సీరియస్

గాంధీభవన్ దగ్గర ఘర్షణపై కాంగ్రెస్ హైకమాండ్ సీరియస్ అయినట్టు తెలిసింది. ఘటనపై మాణిక్కం ఠాగూర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు తీరు మార్చుకోవాలంటూ దిగ్విజయ్ సూచించారు. కొందరు తనపై దాడికి యత్నించారని అనిల్ ఫిర్యాదు చేశారు. దాడి ఘటనను అనిల్, దిగ్విజయ్‌సింగ్ తదితరులు మాణిక్కం ఠాగూర్ దృష్టికి తీసుకువెళ్లారు.